క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం



నూజెండ్ల: మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజలు చేశారు. మారేళ్ళవారిపాలెం, కొమ్మూరం, నూజెండ్ల, బొప్పుడివారిపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

ఈపూరు(శావల్యాపురం): ఈపూరు గ్రామంలోని బోటిమీది ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల మంగళవారం జరగనుంది. 55 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు సారథ్యంలో ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు 200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు విద్యుత్ ప్రభలతోపాటు రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేత్రాలు దానం చేయడం అభినందనీయం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన దొప్పలపూడి చిన లింగయ్య (75) వృద్ధాప్యం వల్ల సోమవారం మరణించారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వారి అనుమతితో మృతుని నేత్రాలను పెదకాకాని శంకర కంటి వైద్యశాల నేత్ర నిధికి దానం చేసినట్లు జిల్లా అమ్మ సొసైటీ కో–ఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా నేత్రాలు దానం చేయటం వల్ల చూపు లేని వారికి చూపు సిద్దిస్తుందన్నారు. శరీర అవయవ దానం చేయటం వలన మరొకరికి ప్రాణం పోస్తుందన్నారు. శంకర కంటి వైద్య నిపుణులు సారథ్యంలో కార్నియా పొరలను ఆపరేషన్ చేసిన తదుపరి ప్రత్యేకంగా బాక్సులో తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద అంజయ్య, పెద అదెయ్య, అంజమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా



నూజెండ్ల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నూజెండ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు గంగినేని పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల జీతాలు పెంచాలని కోరారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వినుకొండ వాసికి డాక్టరేట్



వినుకొండ: వినుకొండ వాసి బొంత రాజీవ్ ఊటీలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి సోషల్ సర్వీస్ కేటగిరిలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రాజీవ్ వినుకొండలో చదువుకొని గత 11 ఏళ్లుగా హైదరాబాద్‌లోని హయత్ నగర్‌లో ద సుధీర్ ఫౌండేషన్‌ను స్థాపించి 125 మంది అనాథ, పేద విద్యార్థులను నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో బొంత రాజీవ్‌ను డాక్టరేట్ వరించింది.

కాపర్ వైరు చోరీ నిందితుడికి రిమాండ్

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన బైపాస్‌రోడ్డులో గణపవరం వద్ద జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఫిబ్రవరిలో బైపాస్ రోడ్డులో 10 వేల మీటర్ల సోలార్ కాపర్ వైరు చోరీకి గురైనట్లు బాధిత సంస్థ ఎండీ నాగరాజు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళగిరి గ్రంథాలయం పేటకు చెందిన అనుమల వాసును అరెస్టు చేసి చోరీకి గురైన 10 వేల మీటర్ల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని చిలకలూరిపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

యువతకు అండగా వైఎస్సార్ సీపీ



యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని, వైఎస్సార్ సీపీ నేతలు

- 12న 'యువత పోరు'ను జయప్రదం చేయాలి
- మాజీ మంత్రి విడదల రజిని
- యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వంలో మోసపోతున్న విద్యార్థులు, యువతకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించనున్న యువత పోరు పోస్టర్లను సోమవారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న తన నివాసంలో పార్టీ నాయకులతో కలసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి యువత పోరును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మోసంపై గళం విప్పాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదినెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ బాబు ప్రజలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు కందుల శ్రీకాంత్, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తానరావు, చిలకలూరిపేట ఎంపీపీ దేవినేని శంకరరావు, పార్టీ యడ్లపాడు మండల అధ్యక్షుడు జాలాది శంకర్, మాజీ ఎంపీపీ మద్దూరి భాస్కర రెడ్డి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, వైస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొప్పురావూరి పటేల్, సింగారెడ్డి కోటిరెడ్డి, మంగు ఏడుకొండలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూటమిపై నిరసన గళం



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- యువత పోరును జయప్రదం చేద్దాం
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు విద్యా వ్యవస్థకు, అలాగే యువతకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగభృతి ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకుల మాటలు నమ్మి ఆంధ్రప్రజలు బలయ్యారని ఆవేదన చెందారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ద్వారా రూ.3,900 కోట్లు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా.. ఇంతవరకు ఫీజురీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు చదువులు కొనసాగించలేక పనులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోందని, ఈ దురాగతాన్ని వైఎస్సార్ సీపీ సహించబోదని, యువత పక్షాన పోరాడుతోందని స్పష్టం చేశారు. చంద్రబాబు సర్కార్‌పై నిరసనగా మార్చి 12న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులతో కలిసి నరసరావుపేటలోని జిల్లా వైఎస్సార్ సీపీ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని బొల్లా పేర్కొన్నారు. అనంతరం ఆయన నాయకులతో కలిసి యువత పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

దగాకోరు సర్కారుపై పోరు



పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ యువత పోరును జయప్రదం చేద్దాం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: విద్యార్థులు, నిరుద్యోగ యువతను టీడీపీ కూటమి దారుణంగా మోసం చేసిందని, దీనిని నిరసిస్తూ చేపట్టిన యువత పోరును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం యువత పోరుకు సంబంధించిన పోస్టర్‌ను పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇచ్చిన కూటమి సర్కారు ప్రజలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. సూపర్‌సిక్స్ హామీల అమలులో చంద్రబాబు డక్ అవుట్ అయ్యాడని ఎద్దేవా చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా మారిందని విమర్శించారు. విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం హామీలను కూటమి సర్కారు గాలికొదిలేసిందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ దగాకోరు విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 12న గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు వైఎస్సార్ సీపీ యువత పోరు పేరుతో ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు వివరించారు. అదే రోజు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లింగంగుంట్లలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండా ఎగరవేస్తామని వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు యువకులు యువత పోరులో భాగస్వాములు కావాలని కోరారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, జిల్లా స్టూడెంట్స్ వింగ్ అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ఉన్నవ గ్రామంలో ప్రచారం చేస్తున్న వేదిక సభ్యులు

యడ్లపాడు: ఫాల్గుణ పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం వైభవంగా నిర్వహించారు. యోగి ప్రబోధానంద యోగ పీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను పలు గ్రామాల ప్రజలకు పరిచయం చేశారు. మండలంలోని వంకాయలపాడు, బోయపాలెం, ఉన్నవ, కారుచోల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక, నరసరావుపేట కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక – నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, తవిటి అమరలింగయ్య, పెరుగు ఏడుకొండలు, కుంచాల చిన్నవెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి, జ్యోతిరావుపూలే విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: మహిళలు విద్యావంతులు కావాలని జీవిత కాలం కృషి చేసిన తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని మహాత్మ జ్యోతిరావుపూలే చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పాల భాస్కరరావు చెప్పారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లోని సావిత్రీబాయి పూలే, జ్యోతిరావుపూలే విగ్రహాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని వెల్లడించారు. దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించారని చెప్పారు. 2023లో అప్పటి ప్రభుత్వం బీసీ భవన్ కోసం కేటాయించిన 53 సెంట్ల స్థలంలో బీసీ భవన్ నిర్మాణం చేపట్టాలని నియోజకవర్గంలోని బీసీ ప్రజలు ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, మారుబోయిన శ్రీనివాసరావు, పోటు శ్రీనివాసరావు, ఉండవల్లి కోటేశ్వరరావు, ముద్దపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

శావల్యాపురం: తుమ్మలకుంట గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో సావిత్రిబాయి పూలే వర్ధంతి సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బిళ్ళా రాజారమేష్, ఉపాధ్యాయులు డి.రవికుమార్ సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పైప్‌లైన్ లీకులకు మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పాలిథిన్ కవర్ల నిషేధానికి తమ వంతుగా ప్రజలు సహకరించాలని, సింగిల్ యూజ్ కవర్లను వినియోగించరాదని సూచించారు. మార్చి నెలాఖరులోగా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. తన ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులు విజయవంతం చేసినందుకు ముస్లింలకు కృతజ్ఞతలు తెలిపారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



అభయాంజనేయస్వామి విగ్రహానికి పూజలు

నాదెండ్ల: గణపవరం జాతీయ రహదారి వద్ద శ్రీనివాస అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, గ్రామంలో కొలువై ఉన్న సీతాలాంబతల్లి (బొడ్డురాయి) వద్ద శివలింగ ప్రతిష్ట మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి బొడ్డురాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణపవరం గ్రామానికి చెందిన యనమంద్ర హనుమత్‌శాస్త్రి బృందం గణపతిపూజ, పుణ్యావాచనం, దీక్షాధారణ, అఖండస్థాపన, మండపారాధన నిర్వహించారు. సోమవారం ఉదయం వాసుహోమం, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, రుద్రాంజనేయస్వామి, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని హోమాలు నిర్వహించారు. ఉదయం బొడ్డురాయి వద్ద శివలింగ ప్రతిష్ట, అనంతరం శ్రీనివాస అభయాంజనేయస్వామి విగ్రహానికి గ్రామోత్సవం, ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ధనలక్ష్మీ గ్రూపు సంస్థల డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

శావల్యాపురం: బొందిలిపాలెం గ్రామంలోని అడవి పేరంటాళ్ళమ్మ ఆలయంలోకి ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్సు చోరీ చేశారు. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. దుండగులు ఆలయం తాళాలు పగలకొట్టి చొరబడి రెండు హుండీలను పగలకొట్టి రూ. 20 వేల నగదు, చిల్లర డబ్బులు, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్సు చోరీ చేశారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీం సభ్యులు పరిశీలించారు. దేవదాయ అధికారి టి.సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.ఐదు లక్షలతో పొంగళ్ల గది నిర్మాణం

రొంపిచర్ల: వి.రెడ్డిపాలెం గ్రామ పరిధిలోని మర్రిచెట్టుపాలెంలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో చట్టు నరసయ్య, వెంకాయమ్మ జ్ఞాపకార్థం వారి మనుమలు చట్టు వేణుగోపాల్, శ్రీనివాసులు రూ.5 లక్షలతో పొంగళ్ల గదిని నిర్మించారు. వారు నిర్మించిన పొంగళ్ల గదిని ఈ నెల 19న నిర్వహించనున్న తిరునాళ్ల సందర్భంగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు వారు సోమవారం తెలిపారు. పొంగళ్ల గదిని నిర్మించిన దాతలను పలువురు భక్తులు అభినందించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నాదెండ్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్య, ఆహ్లాదకర వాతావరణం సాధ్యమవుతుందని సర్పంచ్ మునుగు శోభారాణి చెప్పారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా స్వచ్ఛ సాతులూరు కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. సినిమా హాలు సెంటర్ నుంచి చందవరం సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాలు తొలగించారు. మురుగుకాలువలు శుభ్రం చేయటమే కాక చెత్తకుప్పలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, కార్యదర్శి రాఘవయ్య పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

చిలకలూరిపేటటౌన్: కావూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంటూరు అపెక్స్ ఇంగ్లిష్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ నాగేశ్వరరావు పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలపై మార్గదర్శకం చేశారు. అనంతరం డీఎస్ఆర్ ఫ్రెండ్ సర్కిల్ తరఫున పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ శ్రీనివాసరావు, లింగారావుపాలెం గ్రామపెద్దలు శివబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

యడ్లపాడు: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ ఆడిటర్ డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. లింగారావుపాలెం, వంకాయలపాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గుంటూరుకు చెందిన డీఎస్ఆర్ ఫ్రెండ్ సర్కిల్ తరఫున రూ.5 వేల విలువైన పరీక్ష సామగ్రి కిట్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు అపెక్స్ విద్యాసంస్థల డైరెక్టర్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణకు చర్యలు

ఈపూరు(శావల్యాపురం): ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ అరవపల్లి రామతులసి తెలిపారు. సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ రామతులసి మాట్లాడుతూ మండలంలో తొమ్మిది పాఠశాలలకు చెందిన 540 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయటానికి సంసిద్ధమైనట్టు తెలిపారు. దీనికోసం రెండు పరీక్ష కేంద్రాలు కేటాయించగా ముప్పాళ్ళ గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 270 మంది విద్యార్థులు, ఈపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 270 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టరు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులలో భాగంగా వెలుతురు తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

పిచ్చిరెడ్డి చిరస్మరణీయుడు



విశ్రాంత ఉపాధ్యాయుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు

రొంపిచర్ల: ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కురుగంటి పిచ్చిరెడ్డి చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సంతగుడిపాడులో సోమవారం నిర్వహించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కురుగంటి పిచ్చిరెడ్డి సంతాప సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా పిచ్చిరెడ్డి కుమారుడు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కురుగంటి శ్రీనివాసరెడిని పరామర్శించి సానుభూతి తెలిపారు. పిచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, నాయకులు గడ్డం వెంకట్రావు, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, పడాల చక్రారెడ్డి, గాదె రామిరెడ్డి, ముండ్రు హరినారాయణ, గాడిపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



భక్తి కీర్తనలను ఆలపిస్తున్న భక్త బృందం

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి ఆధ్యాత్మిక సేవా స్రవంతి, మేళ్లచెరువు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భజన బృందాల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే కాసులనాటి నాగరాజశర్మ రచించిన నవగ్రహ మహిమ బాల బోధిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. సేవా స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేళ్లచెరువు ఫౌండేషన్ ప్రతినిధులు మేళ్లచెరువు వీరాంజనేయులు, మల్లికాంబ, శ్రీపట్టాభిరామస్వామి ఆలయ ధర్మకర్త నాగసరపు సుబ్బరాయగుప్త, మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, ఊరా భాస్కరరావు, న్యాయవాది రమణమూర్తి, మండవ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ప్రజా వ్యతిరేకతను ఆపలేరు

సీఐటీయూ నాయకుల ధ్వజం

నరసరావుపేట: సమస్యల పరిష్కారం కోసం ముందస్తు అనుమతితో శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమైన అంగన్‌వాడీల నిర్బంధాలపై పెట్టిన శ్రద్ధ.. హామీలు అమలు చేయడంపై ప్రభుత్వం పెట్టాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ ప్రభుత్వానికి సూచించారు. సోమవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆంజనేయనాయక్ మాట్లాడారు. సోమవారం అంగన్‌వాడీల చలో విజయవాడ కార్యక్రమాన్ని నీరుగార్చేందుకు ఎన్నడూ లేని విధంగా సమావేశాలంటూ సర్కారు హడావుడి చేసిందని, అంగన్‌వాడీలు, హెల్పర్లు రావాలని హుంకుం జారీ చేసిందని విమర్శించారు. వారిని పోలీసుల సాయంతో నిర్బంధించేందుకు యత్నించిందని ధ్వజమెత్తారు. అయినా అంగన్‌వాడీలు విజయవాడలో జరిగిన మహాధర్నాకు హాజరయ్యారని చెప్పారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి పాల్గొన్నారు.

రైతు సమస్య పరిష్కరించాలి

శావల్యాపురం: రెవెన్యూ అధికారులు అవినీతి, నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చందు మండిపడ్డారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో పిచికలపాలెం గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లుకు చెందిన సాగు భూమి విస్తీర్ణం తగ్గించారని ఇన్‌చార్జ్ తహసీల్దారు సబావత్ సురేష్ నాయక్‌కు మోహన్‌చందు ఫిర్యాదు చేశారు. బాధిత రైతుతో కలిసి మాట్లాడుతూ వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్



ఆర్టీసీ డిపో వద్ద నినాదాలు చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు అందజేస్తున్నట్లుగానే తమకు కూడా సామాజిక పింఛన్ రూ.4వేలు అందజేయాలని ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఆర్టీసీ డిపో వద్ద ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ కేవీ చలపతి మాట్లాడుతూ తాము సంస్థలో 25 నుంచి 30ఏళ్ల పాటు చాలా తక్కువ జీతంతో పనిచేసి రిటైరైన తర్వాత కేవలం రూ.1000లు లేదా రూ.1500ల పింఛన్ మాత్రమే పొందుతున్నామన్నారు. తమ కుటుంబాలకు అనారోగ్య సమస్యలు ఎదురైతే భరించే శక్తి తమకు లేదని తెలిపారు. కావున తమకు కూడా నెలకు రూ.4వేల సామాజిక పింఛన్ అందజేయాలని కోరారు. అధ్యక్షులు బ్రహ్మయ్య, కోశాధికారి షేక్ మొహిద్దీన్, పలువురు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయచోటి ఘటనపై నిరసన ర్యాలీ



నరసరావుపేట ఈస్ట్: రాయచోటి వీరభద్రస్వామి ఉత్సవాల ఊరేగింపుపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ మాట్లాడుతూ, హిందువులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు కొలిశెట్టి సుబ్బారావు, ఏవిఆర్‌కె సత్యనారాయణ, జెడి రాజేశ్వరీ, చేగు వెంకటేశ్వరరావు, బిజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, ఏబివిపి రాష్ట్ర కోశాధికారి కోడూరు సాంబశివరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కొత్త రాము తదితరులు పాల్గొన్నారు.